క్లుప్తంగా

సీతారాముల కల్యాణం నేడు

ఎంవీపీకాలనీ: నియోజకవర్గంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జరగనున్న రాములోరి కల్యాణానికి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు శనివారం కొనసాగాయి. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆదివారం సీతారాములను పెళ్లికూతురు, పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణ వేడుకకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించాలని కోరారు.

సెంట్రల్ జైల్‌లో చలివేంద్రం ప్రారంభం



ములాఖత్ కోసం వెళ్లిన వారికి తాగునీరు అందిస్తున్న జైల్ అధికారులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో వేసవి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఖైదీలను కలవడానికి వెళ్లే వారి కోసం శనివారం జైల్ ఆవరణలో ములాఖత్ హాల్ ముందు చలివేంద్రం ప్రారంభించారు. ములాఖత్ కోసం వెళ్లిన వారికి జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు సూచనలతో డిప్యూటీ సూపరింటెండెంట్లు జవహర్‌బాబు, సాయిప్రవీణ్, జైలర్లు, సిబ్బంది తాగునీరు అందించారు. చల్లదనం కోసం వడకట్టిన నీటిని మట్టి కుండల్లో నిల్వ ఉంచి పంపిణీ చేస్తున్నారు. జైల్ లోపల ఖైదీలకు శుక్రవారం మజ్జిక పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన విషయం తెలిసిందే.

నీట్ విద్యార్థులకు ప్రత్యేక కోర్స్

బీచ్‌రోడ్డు: 'నీట్'కు సన్నద్ధమవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆత్రేయ కోర్సును ప్రారంభిస్తున్నట్లు శ్రీచైతన్య అకాడమీ డైరెక్టర్ బి.సుష్మా తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో శనివారం ఆత్రేయ కోర్సు వివరాలను ఆమె వెల్లడించారు. సుస్థిర బోధనా విధానం ద్వారా 11వ తరగతి విద్యార్థుల కోసం ఆత్రేయ కోర్స్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు చెప్పారు. ఫిజిక్స్‌పై ప్రత్యేక దృష్టి సారించే పీ2సీ బీజెడ్ ద్వారా సెషన్లు రెట్టింపు చేస్తుందన్నారు. విద్యార్థుల్లో విషయ అవగాహన పెంచడం ద్వారా నీట్‌లో ఉత్తమ ర్యాంకుల సాధనకు అవసరమైన శక్తిని అందిస్తుందన్నారు.


శ్రీవారి సేవకు ఎంవీపీ కాలనీ భక్తులు



శ్రీవారి సేవకు వెళ్లనున్న మహిళా భక్తులతో సత్యకుమార్

ఎంవీపీకాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా శ్రీవారి సేవ చేసేందుకు ఎంవీపీ కాలనీలోని మహిళా భక్తులు తరలివెళ్లనున్నారు. షిర్డీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ దేవాలయల్లో సేవలందిస్తున్న వీరు ఈ నెల 8 నుంచి వారం రోజుల పాటు శ్రీవారి సేవలో పాల్గొననున్నారు. 15 మంది మహిళా భక్తులు ఎంవీపీ కాలనీ నుంచి వెళ్లి శ్రీవారి సేవల్లో పాల్గొంటారని ట్రస్ట్ చైర్మన్, ఆధ్యాత్మిక వేత్త సత్యకుమార్ తెలిపారు. శనివారం ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని సాయిబాబా ఆలయంలో మహిళలకు అవసరమైన సూచనలిచ్చారు. ట్రస్ట్ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పేపర్ వర్క్‌పై అవగాహన



జైల్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కలెక్టరేట్ ఎన్ఐసీ బృందం సభ్యులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఈ-పేపర్ వర్క్‌పై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. సెంట్రల్ జైల్‌లో పూర్తిగా పేపర్ లెస్ వర్క్ చేపట్టడానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ-పేపర్ వర్క్ కోసం కలెక్టరేట్ నుంచి ఎన్ఐసీ బృందం కారాగారాన్ని సందర్శించింది. జైల్‌లో మినిస్టీరియల్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించింది. జైల్ అధికారుల సమక్షంలో ఈ-పేపర్ వర్క్ ఎలా చేయాలో వారికి బృందం సభ్యులు అవగాహన కల్పించారు.

అరకొర వైద్యం

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ – పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు తగ్గిపోతున్నాయి. పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించాల్సిన యూపీహెచ్‌సీలు బోసిపోతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల చెంతకే మెరుగైన వైద్యం అందించాలని నగరంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. పేదలకు స్పెషలిస్ట్ వైద్య సేవలందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పెషాలిటీ వైద్య సేవలు నిలిచిపోయాయి. గతంలో ఒక్కో విభాగానికి ఒక్కో స్పెషలిస్ట్ వైద్యుడు అందుబాటులో ఉండేవారు. ఇప్పుడు వారందరినీ తీసేయడంతో ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఒక్కరే **అన్ని విభాగాలకు సేవలందించాల్సి వస్తోంది.** – ఆరిలోవ





శ్రీకృష్ణాపురంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్



తూర్పు నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ) పేరిట ఏడు చోట్ల ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా పేరు మార్చారు. ప్రస్తుతం వీటిలో కొత్తగా వైద్య సేవలు అందించడం లేదు సరికదా.. ఉన్న వాటిని తొలగించేసి పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యాన్ని దూరం చేస్తోందనే ఆరోపణలు మూటకట్టుకుంటోంది.

'తూర్పు'లో ఏడు చోట్ల..

నియోజకవర్గంలోని జీవీఎంసీ జోన్-2 పరిధిలో 4, జోన్-3 పరిధిలో 3 చొప్పున ఆరోగ్య కేంద్రాలున్నాయి. జోన్-2 పరిధి 10వ వార్డు ఆదర్శనగర్ ప్రాంతం వివేకానందనగర్, 11వ వార్డు బాలాజీనగర్, 13వ వార్డు ఆరిలోవ కాలనీ(తోటగరువు), శ్రీకృష్ణాపురంలో.. జోన్-3 పరిధి 16వ వార్డు ఇసుకతోట, 20, 21 వార్డుల పరిధి చినవాల్తేరులో రెండు చోట్ల ప్రజలకు అందుబాటులో గత ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసింది.

ఇన్‌చార్జి పైనే భారం..!

ఆరిలోవ కాలనీ ఆరోగ్య కేంద్రానికి ఆరు నెలలుగా వైద్యాధికారి లేకపోవడం వల్ల ఇక్కడ అరకొరగా వైద్య సేవలందుతున్నాయి. బాలాజీనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారే ఇక్కడ ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడికి వైద్య పరీక్షల నిమిత్తం వస్తున్న రోగులు అవస్థలు పడుతున్నారు.

తగ్గిన ఓపీ..

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ వైద్యులు లేకపోవడంతో ఓపీ తగ్గిపోయింది. ఒకప్పుడు మెడికల్ ఆఫీసర్‌తోపాటు ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, గైనిక్, డెర్మటాలజీ వైద్యులు రోజుకు ఒకరు చొప్పున అందుబాటులో ఉండేవారు. వారందర్నీ కూటమి ప్రభుత్వం నిలిపేయడంతో వైద్యాధికారి మాత్రమే ఆయా విభాగాలను చూడాల్సి వస్తోంది. దీంతో రోగులు వెళ్లడం తగ్గించేశారు. వైద్యులందరూ అందుబాటులో ఉన్నప్పుడు ప్రతి కేంద్రంలో రోజుకు 70 నుంచి 80 వరకు ఓపీ నమోదయ్యేది. ప్రస్తుతం రోజుకు 30 నుంచి 40 మధ్యలో ఓపీ తగ్గిపోయింది. దీంతో విశాలమైన ఆరోగ్య కేంద్రాలు వెలవెలబోతున్నాయి. ఆరిలోవ నుంచి విమ్స్‌కు, మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, చినవాల్తేరు, పెదవాల్తేరు, ఇసుకతోట, వెంకోజీపాలెం ప్రాంతాల నుంచి కేజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తోందని రోగులు, వారి కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ వైద్యులందరూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



వెలవెలబోయిన ఆరిలోవ యూపీహెచ్‌సీ

స్పెషలిస్ట్ సేవలు బంద్

గతంలో గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ రోజుకు ఒకరు చొప్పున యూపీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండేవారు. వారంలో ప్రతి రోజూ గైనిక్ అందుబాటులో ఉండటంతో పాటు సోమవారం ఈఎన్‌టీ, డెర్మటాలజీ, బుధవారం జనరల్ మెడిసిన్, గురువారం ఆర్థోపెడిక్, శనివారం జనరల్ సర్జన్ ప్రత్యేక సేవలందించేవారు. ప్రతి కేంద్రంలో 10 పడకలు ఏర్పాటు చేశారు. అన్ని రకాల వైద్య పరీక్షల కోసం ప్రత్యేకంగా ల్యాబ్ ఉండేది. ఇప్పుడు ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ వైద్యులు ఎవ్వరూ లేరు. మెడికల్ ఆఫీసర్ మాత్రమే అన్ని రకాల విభాగాలకు వచ్చిన రోగులకు వైద్యం అందించాల్సి వస్తోంది.

ఆరిలోవ కాలనీలో ఆరోగ్య కేంద్రం





ఆరిలోవ ఆరోగ్య కేంద్రంలో రోగికి బీపీ చెక్‌చేస్తున్న నర్స్

ఆరోగ్య కేంద్రంలో ఒక్క డాక్టరే ఉన్నారు

ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పుడు ఒక్క డాక్టరే ఉంటున్నారు. రోగులందరికీ వైద్యం చేసే సరికి ఎక్కువ సమయం పడుతోంది. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని మా ప్రాంతంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లడం లేదు. ఏదైనా అనారోగ్యం వస్తే విమ్స్‌కు వెళ్తున్నాం
– వి.సరస్వతమ్మ, ఆరిలోవ కాలనీ

వైద్యులందరూ అందుబాటులో ఉండాలి

ప్రజలకు అందుబాటులో ఉండాలని ఇళ్లకు దగ్గరగా ఆస్పత్రులు నిర్మించారు. వాటిలో అందరు డాక్టర్లు అందుబాటులో ఉండి వైద్యం అందించారు. ఇప్పుడు వారు లేరు. దీని వల్ల వైద్యం అందకపోవడంతో దూరంగా ఉండే విమ్స్, కేజీహెచ్‌లకు వెళ్లాల్సి వస్తోంది.
– ఎస్.నారాయణరావు, సుందర్‌నగర్

ఏయూను సందర్శించిన విదేశీ ప్రతినిధులు



జ్ఞాపిక అందజేస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రిపబ్లిక్ ఆఫ్ అంగోలా రాయబారి ఎక్సలెన్సీ క్లెమెంటే కామెన్హా శనివారం సందర్శించారు. వీసీ ఆచార్య రాజశేఖర్‌ను కార్యాలయంలో కలుసుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాలలో చదువుతున్న అంగోలాకు చెందిన 46 మంది విద్యార్థులకు అద్భుతమైన విద్యా సౌకర్యాలు కల్పించినందుకు క్లెమెంటే కామెన్హా సతీమణి మరియా, మినిస్టర్ కౌన్సిలర్ అబెల్ మావుంగో ఏయూ వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున జ్ఞాపిక అందజేసి సత్కరించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందజేస్తామని ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులు తెలిపారు.

గచ్చిబౌలి అడవిని రక్షించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న యువత

ఏయూక్యాంపస్: అభివృద్ధి పేరుతో అడవులను నరికివేయడం సరికాదని యువత నినదించారు. క్లైమేట్ ఫ్రంట్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణలో ఉన్న గచ్చిబౌలి అడవిని నరికివేయాలనే నిర్ణయాన్ని నిరసిస్తూ శనివారం సాయంత్రం బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. క్లైమేట్ ఫ్రంట్ ప్రతినిధి ఓంద్రిల్లా మాట్లాడుతూ ఐటీ పార్క్ అభివృద్ధి చేయడానికి అడివిలో 400 ఎకరాలు నరికేయాలనే ప్రయత్నం, ప్రణాళిక సరకాదన్నారు. ఈ అడవిలో విలువైన జింకలు, నెమళ్లు, తాబేళ్లు, కొండచిలువలు వంటి అనేక వణ్యప్రాణులు, పక్షులు ఉన్నాయన్నారు. అభివృద్ధి పేరుతో అడవులను నరికేస్తూ, వణ్యప్రాణుల ఉనికికే ప్రమాదాన్ని తీసుకురావడం సరికాదని హితవు పలికారు. ఈ అడవులను రక్షించుకోవడానికి అవిశ్రాంతంగా పోరాడే వారందరికీ తాము సంఘీభావంగా నిలుస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ సంక్షోభం వస్తోందని, దీని ఫలితంగా వేడిగాలులు పెరగడం, విపత్తులు సంభవించడం చూస్తున్నామన్నారు. అదే సమయంలో కాలుష్యం తీవ్రంగా పెరగిపోతోందన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అది స్థిరంగా జరగాలని కోరుకుంటామన్నారు. పచ్చదనాన్ని నాశనం చేస్తూ జరిగే అభివృద్ధిని తాము స్వాగతించమని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజేష్, వినయ్, జెనిన్, దీపక్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీపీ చొరవతో నిరాశ్రయుడికి ఆశ్రయం



రెడ్ క్రాస్ హోంకు రామారావును అప్పగిస్తున్న సీఐ పైడయ్య

బీచ్‌రోడ్డు: దసపల్లా హిల్స్ వద్ద ఒక వ్యక్తి వయోవృద్ధాప్యంతో నిరాశ్రయుడిగా తిరగడాన్ని గుర్తించిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అతడికి ఆశ్రయం కల్పించారు. శనివారం ఉదయం దసపల్లా హిల్స్ ప్రాంతంలో శ్రీకాకుళానికి చెందిన శివకోటి రామారావు అనే వ్యక్తి నిరాశ్రయుడిగా తిరగటాన్ని సీపీ గుర్తించారు. వెంటనే మూడో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకి చేరుకున్న సీఐ పైడయ్య రామారావును తీసుకెళ్లి పెదవాల్తేరులోని రెడ్ క్రాస్ హోంకు అప్పగించారు.

దివ్యాంగ విద్యార్థుల విజ్ఞాన యాత్ర



సబ్‌మెరైన్ వద్ద హైదరాబాద్‌కు చెందిన దివ్యాంగ విద్యార్థులు

ఏయూక్యాంపస్: విశాఖ నగరాన్ని శనివారం దివ్యాంగ విద్యార్థులు సందర్శించారు. హైదరాబాద్‌కు చెందిన 25 మంది విద్యార్థులు సీఐఐ-యంగ్ ఇండియన్(వైఐ) సహకారంతో విజ్ఞాన యాత్రకు నగరానికి వచ్చారు. వీరు ముందుగా హిందుస్తాన్ షిప్‌యార్డ్‌ని సందర్శించి నౌకల తయారీ విధానం తెలుసుకున్నారు. విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఏ విధంగా రాణిస్తున్నారో వారికి ప్రత్యక్షంగా వివరించారు. అనంతరం వీరి బృందం బీచ్ రోడ్డులోని టీయూ 142 యుద్ధ విమానం, సీ హారియర్ మ్యూజియం, సబ్‌మెరైన్ మ్యూజియంలను సందర్శించారు. భారత నావికాదళం వారసత్వాన్ని, దేశ భద్రతలో బారత రక్షణ వ్యవస్థ పటిమను వారు అర్థం చేసుకునేలా విజ్ఞాన యాత్ర సాగింది. కార్యక్రమానికి వైఐ విశాఖపట్నం అక్సెలిబిలిటీ చైర్ రమీలా బండి నాయకత్వం వహించగా.. వైఐ సభ్యులు విరాట్ మహేశ్వరి, రోహిత్ కంచర్ల తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

- సంఘ సంస్కర్త జయంతి వేడుకల్లో కలెక్టర్ హరేందిర ప్రసాద్
- నేతలు, అధికారుల ఘన నివాళి



బీచ్ రోడ్డులో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఏయూక్యాంపస్: స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ జయంత్యుత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సమాజంలో వెనుకబడిన, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, సమానత్వం కోసం పాటు పడిన బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అన్నారు. బీచ్‌రోడ్డులోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌ను సందర్శించడం, అక్కడ మౌలిక వసతులను పరిశీలించి సదుపాయాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్లు మల్లయ్య నాయుడు, శివ ప్రసాద్, డిపిఓ ఫణి రామ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నివాళి

సమాజంలో సమానత్వం సాధించడమే జగ్జీవన్ రామ్ ఆశయమని, దానిని సాకారం చేసే దిశగా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు అన్నారు. బీచ్ రోడ్డులోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి ఆయన పూల మాల వేసి నివాళులర్పించారు.

ఆదర్శనీయుడు

మద్దిలపాలెం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం రామ్మోహన్ భవన్‌లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ముఖ్య అతిథి ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమానత్వం ద్వారా దేశ సమైక్యత సాధ్యమవుతుందని చాటిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్ మాట్లాడుతూ ఉప ప్రధానిగా, పార్లమెంట్ సభ్యుడిగా జగ్జీవన్ రామ్ దేశానికి అనేక సేవలందించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని డిపోల నాయకులు, ఉద్యోగులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

ఏయూలో ఘనంగా..

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. జగ్జీవన్ రామ్ అందించిన సేవలను శ్లాఘనీయమని కొనియాడారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాళ్లు జి.శశిభూషణరావు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఎం.వి.ఆర్ రాజు, ఆచార్య ప్రేమానందం, ఎస్సీ ఎస్టీ అండ్ బీసీ-సీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.షారోన్ రాజు, ఆచార్యులు, పరిశోధకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

ఎంవీపీకాలనీ: డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ఉప ప్రధానిగా, వెనుకబడిన వర్గాల ప్రతినిధిగా జగ్జీవన్ రామ్ విలువైన సేవలు అందించారన్నారు. ఆయని స్ఫూర్తితో పాలకులు వెనుకబడిన వర్గాల ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఏయూలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్, ఆచార్యులు



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈడీ సత్యపద్మ, ఉద్యోగులు

వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో..

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పూలమాల వేసి నివాళి అర్పించారు. రక్షణ మంత్రిగా, ఉప ప్రధానిగా 30 ఏళ్ల కేంద్ర కేబినెట్‌లో పనిచేసి దేశానికి ఎనలేని సేవలందించారని జగ్జీవన్ రామ్‌ను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ప్రధాన గణాంకాధికారి హరి ప్రసాద్, ఎస్ఈ భవానీశంకర్, ఈఈ రామరాజు, డీఎఫ్‌వో సుజాతా శివానీ, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో కొనసాగుతున్న డ్రెడ్జింగ్



సాగర తీరంలో సముద్రపు కోతను నియంత్రించడానికి ప్రతీ సంవత్సరం నిర్వహించే డ్రెడ్జింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. విశాఖ పోర్ట్ అథారిటీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. బీచ్‌రోడ్డులోని సబ్‌మెరైన్ మ్యూజియం వెనక భాగంలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. సముద్రం లోపలి నుంచి ఇసుకను తోడి తీరంలో పోస్తున్నారు. ఈ ప్రక్రియలో నల్లని నీటితో కూడిన ఇసుక తీరానికి పైపులలో చేరుతోంది. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం